క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



లింగాలఘణపురం: చీటూరు గ్రామానికి చెందిన బోయిని నర్సయ్య గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా ఆయనకు మంజూరైన రూ.3 లక్షల ఎల్‌ఓసీని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి శనివారం అందజేశారు. నిరుపేద కుటుంబానికి ఎల్‌ఓసీ అందించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరికి మాజీ సర్పంచ్ ఐలయ్య, నాయకులు ప్రభాకర్, వీరస్వామి, సత్తయ్య కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన రైతులు

మండలంలోని ఆదర్శ ఏనెబావి రైతు ఉత్పత్తిదారుల సంస్థ చైర్మన్ పరకాల కృష్ణ ఆధ్వర్యంలో పలువురు శనివారం ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి రామచంద్రగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు.

అంతర్జాతీయ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



పాలకుర్తి: అంతర్జాతీయ స్థాయి పోటీల్లో గూడూరు టీజీటీడబ్ల్యూఆర్‌జేసీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ రేణుకా రాథోడ్ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ గాజుపురాలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ టెన్నిస్, వాలీబాల్ పోటీల్లో విద్యార్థినులు పాల్గొని ప్రతిభ చూపి బహుమతులు గెలుపొందినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారికి ప్రశంసపత్రాలు అందజేసి అభినందించారు. పీఈటీ సుస్మిత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బావండ్లపల్లి చిరంజీవికి అవార్డు



తరిగొప్పుల: మండలంలోని అక్కరాజుపల్లి గ్రామానికి చెందిన జానపద కళాకారుడు, తెలంగాణ సాంస్కృతిక సారధి గాయకులు బావండ్లపల్లి చిరంజీవి జాతీయ స్థాయి బంగారు నంది అవార్డు అందుకున్నారు. మెగా హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్లోబల్ ఐకాన్, బంగారు నంది అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమం శుక్రవారం హైదరాబాదులోని బీఎం బిర్లా సైన్స్ మ్యూజియం, భాస్కర్ ఆడిటోరియంలో చేపట్టగా మాజీ ఎమ్మెల్యే బాబుమోహన్ చేతుల మీదుగా ఈ అవార్డును చిరంజీవి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంది అవార్డు దక్కడం సంతోషంగా ఉందన్నారు.

మహేశ్‌కు..



జఫర్‌గఢ్: హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన బైరపాక మహేశ్ గ్లోబల్ ఐకాన్ అవార్డును అందుకున్నారు. మెగా హెల్పింగ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో 2025 జాతీయ ప్రతిభా పురస్కారాల్లో భాగంగా ఈ అవార్డును హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ మ్యూజియంలో ఫౌండేషన్ చైర్మన్ శిరీషరెడ్డితో పాటు పలువురు సీనినటుల చేతుల మీదుగా మహేశ్‌కు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు అవార్డుతో పాటు సత్కారం పొందడం సంతోషంగా ఉందన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

జనగామ: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. శనివారం క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. జాల్‌బాయ్ తండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు సబావత్ రమేశ్, సీనియర్ నాయకులు సబావత్ హనుమంతు,సబావత్ శ్రీనివాస్, భూక్యా తిరుపతి, జరుపుల రాములు, జరుపుల రాజు, జరుపుల భీముడు, కోడవత్ తిరుపతి, కోడవత్ పరుమేశ్, కోడవత్ సూర్య, పూల్యా, ఈర్య, సంతోష్, గణేష్, దాస్యలు బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గులాబీ పార్టీలో చేరగా, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, బాల్దె సిద్ధిలింగం, ఇర్రి రమణారెడ్డి, గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, మేకల కలింగరాజు, మసిఉర్ రెహమన్, శారద, భైరగోని యాదగిరిగౌడ్, బూరెడ్డి ప్రమోద్‌రెడ్డి, రాజు, రేఖ, మాజీ ఎంపీటీసీలు భూక్యా జూంలాల్ నాయక్, తాళ్లపల్లి పోషయ్య గౌడ్, మాజీ సర్పంచ్ రాజు, ఏడేల్లి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

ముందస్తు ఉగాది వేడుకలు



జనగామ: వేడుకల్లో చిన్నారులు



బచ్చన్నపేట: ఉగాది పచ్చడితో హెచ్‌ఎం, విద్యార్థులు



దేవరుప్పుల: సింగరాజుపల్లి పాఠశాలలో..

జనగామ: జిల్లాలోని పలు పాఠశాలల్లో ముందస్తు ఉగాది వేడుకలను శనివారం నిర్వహించారు. జనగామలోని మృదుల ప్రైవేట్ కిడ్స్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ సునీత, టీచర్లు ఉమ, సుధ తెలుగుదనం ఉట్టిపడేలా వేడుకలు చేపట్టారు. షడ్రుచులతో పచ్చడి తయారు చేసి సంబరాలను జరుపుకున్నారు.

బండనాగారంలో..

బచ్చన్నపేట: మండలంలోని బండనాగారం ఉన్నత పాఠశాలలో ముందస్తు ఉగాది వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉగాది పచ్చడిని తయారు చేసి పంచిపెట్టి పంచాంగ శ్రవణం వినిపించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఇజ్జగిరి సిద్దయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సింగరాజుపల్లిలో..

దేవరుప్పుల: సింగరాజుపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం అంబటి అంజయ్య ఆధ్వర్యంలో చిన్నారులు ముందస్తు ఉగాది సంబురాలు ఘనంగా నిర్వహించుకున్నారు. విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను పురస్కరించుకుని పాఠశాలలో పచ్చని తోరణాలు, ఉగాది పచ్చడి, స్వీట్లు పంపిణీ చేసి ఉత్సవ విశిష్టతను చాటారు. ఉపాధ్యాయులు మాధవి, చైతన్య, సునీత, సోమలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ



పాలకుర్తి టౌన్: రిజిస్టర్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్: ప్రభుత్వ ఆస్పత్రిలో విధుల్లో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తుండడంతో ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత శ్రేణి ఆస్పత్రిని ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రి అంతా కలియ తిరిగి ఆస్పత్రి నిర్వహణ, హాజరైన, గైర్హాజర్ అయిన సిబ్బంది ఎంత మంది ఉన్నారని రికార్డులను చూశారు. మందుల లభ్యత గురించి ఆరా తీశారు. ఆస్పత్రిలో బయోమెట్రిక్ మిషన్‌ను పరిశీలించారు. సిబ్బంది విధుల్లో హాజరు కాని పరిస్థితిని చూసి ప్రజలకు సేవ చేయాల్సిన వారే నిర్లక్ష్యంగా వ్యవహరించటం పట్ల ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి నుంచే జిల్లా వైద్యాధికారి మలికార్జున్‌రావుకు ఫోన్ చేసి డ్యూటీలో లేని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డాక్టర్ స్వప్న, కాంగ్రెస్ నాయకులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, వీరమానేని యాకతరావు తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరాలయంలో పూజలు

సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి.. స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభతో ఆమెకు స్వాగతం పలికారు. స్వామివారి శేషవస్త్రంతో సన్మానించి ప్రసాదం అందజేశారు. ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు, సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, అర్చకులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా సీఎం సహాయనిధి

దేవరుప్పుల: అభాగ్యులకు అండగా సీఎం సహాయనిధి దోహదపడుతుందని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మండలంలోని ధర్మాపురానికి చెందిన ఏడెల్లి శ్రీను కూతురు సోనీకి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో కిరణ్ కుమార్

జనగామ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో శనివారం జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన లబ్ధిదారులకు రూ.9లక్షల విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కిరణ్ అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీతో పాటు కిరణ్‌కుమార్‌గౌడ్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు మహేందర్, జనగామ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బన్సీలాల్ నాయ క్, నాయకులు పాల్గొన్నారు.

స్కావెంజర్లకు గౌరవ వేతనం చెల్లించాలి

● టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజు

జనగామ రూరల్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్కావెంజర్లకు గౌరవ వేతనం వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్ఎస్.రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌కు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఒక వైపు మార్చితో ఆర్థిక సంవత్సరం ముగియనుండగా ఇంతవరకు పాఠశాలలకు నిధులు విడుదల కాలేదన్నారు. స్కావెంజర్ల సేవలు లేనిదే పాఠశాల నిర్వహణ కష్టంగా ఉంటుందని, వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ బాధ్యులు అంకుశావళి, వజ్రయ్య, రాజారెడ్డి, లక్ష్మణ్, రాజేంద్రకుమార్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీపీఎం దీక్షలు

జనగామ రూరల్: పట్టణంలోని హైదరాబాద్ జాతీయ రహదారిపై బైపాస్ రోడ్డుపై అండర్‌పాస్ నిర్మించాలని సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం దీక్షలను కేజీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నె వెంకట మల్లయ్య సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్‌పాస్ నిర్మిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. ఉపేందర్, ఆంజనేయులు, శివారులస్వామి, సత్తయ్య, అంజమ్మ రాజు పాల్గొన్నారు.

ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

జనగామ రూరల్: సాగునీరు అందక ఎండిపోయిన పంటలకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై శనివారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాజ్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

ఉగాది కవితలు

లోక కల్యాణానికి..



ఓ విశ్వావసు!
ఆహాకారాల సమాధుల్లో ఆత్మ గౌరవ
జెండా నెగిరించు
జగజ్జేతకై ఉవ్విళ్లూరుతున్న
దురహంకార చిత్తాలలో
శాంతి బీజాలు మొలిపించు
ఉచితాలను కట్టిపెట్టి పానాన్ని
పూలసజ్జలో నిలిపే
గోలిబిళ్లకు గొడుగు పట్టు
బతుకును పాలవెల్లిలా మార్చే అక్షరమాలకు
హారతిపట్టు
చూపిన దారుల్లో దీపాలు వెలిగించు
పడిన అగాధాల్లో ప్రగతి పట్టాలు పరువు
పాపం పండిన నాడే తలపండు పగిలించు
భోక్తల సేద తీరాలలో విలాపాలు వినిపించు
మాట తప్పిన నాలుకలన్నీ శాశ్వతంగా
మూగవోనియ్
స్వార్థ చింతన ఏలికల్ని సాగరంలోనే
నిద్రోవోనియ్
పంటపెంచే కన్నులల్లో, పంట కాసే కన్నులల్లో
పంట విరిసే వేళల్లో పంటకొచ్చే కాలాల్లో
తోడైయుండు అమ్మలా నీడై యుండు నాన్నలా
లోక కల్యాణానికై లోక కల్యాణానికై

- నిమ్మ రాంరెడ్డి, కొడవటూరు, జనగామ

తీయని ప్రేమానురాగాలు..



పచ్చదనంతో కళకళలాడే పల్లె టూరు
మామిడి తోరణాలతో మెరిసే గుమ్మాలు
తెలుగు గడ్డమీద తొలి ఉగాది
భిన్న సంస్కృతులకు బహు పునాది
పల్లె పట్నాలందు వెలుగు చూడగా
పాడి పంటలన్ని పచ్చ గుండగా
ఉగాది పచ్చడి బహు కమ్మదనం
వేప పువ్వులు చేదుదనం
మామిడి పువ్వులు వగరుదనం
మమతను పంచే మనుసుల కొలువై
తీయని ప్రేమానురాగాలు.

- లకావత్ చిరంజీవి, సూరారం, జనగామ

ఆగమన తోరణం



ఆరు రుతువుల ఆగమన తోరణం
షడ్రుచులను ఆస్వాదించే తరుణం
రాలిన చోటే చిగురించే
ఆకుల అభినయం
కొత్త ఆశల, ఆశయాల ఆరంభ చిహ్నం
తెలుగు తనాన్ని, తరువు గుణాన్ని
చాటిచెప్పే అద్భుతమైన వేడుక
యాది, మనాది లేని మరో ఏడాది
మరో చరిత్రకు పునాది అవదా ఈ ఉగాది

- మాద శ్రీధర్, జఫర్‌గఢ్, జనగామ

పంట రుణాలు సకాలంలో చెల్లించాలి

పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల నరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: రైతులు పంటరుణాలను సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని స్టేషన్‌ఘన్‌పూర్ పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల నరేందర్‌రెడ్డి అన్నారు. ఘన్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలక మండలి సమావేశాన్ని సీఈఓ మగ్దుంఅలీ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్ మాట్లాడారు. రైతుల దీర్ఘకాలిక రుణాలు, పంటరుణాలపై అపరాధ వడ్డీ తగ్గించేందుకు జిల్లా సహకార అధికారి అనుమతి కోరేందుకు సమావేశంలో తీర్మానం చేసినట్లు తెలిపారు. అదేవిధంగా సంఘ పరిధిలోని గ్రామాల్లో యాసంగి సీజన్-2025 కోసం వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, నిర్వహణ, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాల్లో నూతనంగా సీఎస్‌సీ సెంటర్ల ఏర్పాటు, జమ, ఖర్చుల పట్టికలు, సిబ్బంది జీతభత్యాల పెంపు తదితర అంశాలపై పాలకమండలి సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశామని చెప్పారు. కార్యక్రమంలో పాలకమండలి ఉపాధ్యక్షుడు చిర్ర నాగరాజు, డైరెక్టర్లు చింత ఎల్లయ్య, తోట సత్యనారాయణ, మారెపల్లి కిషన్‌రెడ్డి, చల్లా సత్తిరెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కామల్ల ఐలయ్య కోరారు. శనివారం మండల కేంద్రంలో కార్మికుల భవనంలో పట్టణ అధ్యక్షుడు గంధమల్ల కిష్టయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటాలు చేసేది బీఎస్‌ఆర్‌కేఎస్ మాత్రమేనని అన్నారు. అనంతరం మండల కోకన్వీనర్‌గా కొల్లూరి రవిని నియమించారు. మధు, యాదగిరి, ఇరుగు మహేందర్‌పాల్గొన్నారు.

కార్మికులకు నష్టం జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత

రఘునాథపల్లి: సామర్థ్యానికి మించి నిర్మించే అంతస్తులు కూలితే.. అందులో కార్మికులకు జరిగే నష్టానికి ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని భవన నిర్మాణరంగ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి రాసమల్ల కొమురయ్య డిమాండ్ చేశారు. శనివారం వెల్ది గ్రామంలో ఏర్పాటు చేసిన కార్మికుల సమావేశంలో ఆయన మాటాడారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భారతదేశం సంస్కృతీ, సంప్రదాయాలకు పుట్టినిల్లు



హర్యానా వేషధారణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

తరిగొప్పుల: మన భారతదేశం సంస్కృతీ, సంప్రదాయాలకు పుట్టినిల్లు అని హెచ్‌ఎం బానోత్ రవీందర్ అన్నారు. స్థానిక పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏక్ భారత్- శ్రేష్ఠ భారత్ ఇన్‌చార్జ్ ఉపాధ్యాయిని నాగవెల్లి అనిత ఆధ్వర్యంలో శనివారం హర్యానా కల్చరల్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హర్యానా వంటకాలు, సంప్రదాయ వేషధారణలతో నాట్య ప్రదర్శనలు చేశారు. ఉపాధ్యాయులు పాలెపు విజయ, జోసఫ్ బేబి, యూసఫ్ పాషా, పద్మ, అమర్నాథ్, శ్రీనివాస్, నాగరాణి, కవిత, సుమలత, రవి, కుమారస్వామి, సంధ్య, సుజాత, మంజుల, సీఆర్పీ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏ రాజకీయ పార్టీలో చేరను

● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

జఫర్‌గఢ్: తాను ఏ రాజకీయ పార్టీలో చేరబోనని, ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తూ శాసన మండలిలో వారి గొంతుకనవుతానని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన శ్రీపాల్‌రెడ్డి మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగాలన్నా, విద్యావవస్థ బలోపేతం కావలన్నా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొల్లా మహిపాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లారెడ్డి, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు. కాగా, మండలంలోని హిమ్మత్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు పోతు రాజారెడ్డి పదవీ విరమణ కార్యక్రమంలో శ్రీపాల్‌రెడ్డి పాల్గొని ఆయనను ఘనంగా సన్మానించారు. ఎంఈఓ రఘునందన్ రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్ దాబాలో కుళ్లిన చికెన్

● వినియోగదారుల ఆరోపణ

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని ఆర్‌ఆర్ దాబాలో బిర్యానీలో కుళ్లిన చికెన్ వచ్చిందని వినియోగదారులు ఆరోపించారు. ఖిలాషాపూర్‌కు చెందిన అనిల్, సుధాకర్‌లు శనివారం మండల కేంద్రంలోని హనుమకొండ వైపు వెళ్లే దారిలోని దాబాకు వెళ్లారు. బిర్యానీ ఆర్డర్ వేయగా.. రంగు మారిన చికెన్ ముక్క వచ్చింది. బర్డ్‌ఫ్లూ సోకుతున్న సమయంలో ఇలాంటి చికెన్ వడ్డిస్తారా అని దాబా యజమాని దృష్టికి తీసుకెళ్లారు. అదేం కుళ్లిన చికెన్ కాదని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడని వారు చెబుతున్నారు. ఫొటోలో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ విషయాన్ని అధికారులకు ఫిర్యాదు చేయలేదు. దాకాగా, దాబా యజమానిని వివరణ కోరగా చికెన్ నాణ్యతపొందినదే అని తెలిపారు.

పాఠశాలల్లోనే దేశ భవిష్యత్ నిర్మాణం

స్టేషన్‌ఘన్‌పూర్: తరగతి గదిలోనే దేశ భవిష్యత్ నిర్మాణం జరుగుతుందని వరంగల్ నేత్రాసనం పీఠాధిపతి బిషప్ ఉడుముల బాల అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని ఫాదర్ కొలంబో ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల చిన్నారులచే చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. అనంతరం ప్రిన్సిపాల్ ఫాదర్ థామస్‌కిరణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథి బిషప్ మాట్లాడారు. అనంతరం ఇటీవల విశాఖపట్నం అగ్రపీఠాధిపతిగా ఎంపికైన బిషప్ ఉడుముల బాలను ఫాదర్ థామస్‌కిరణ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయబృందం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు, పేరెంట్స్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

జఫర్‌గఢ్: ఆర్యవైశ్యులు సేవా కార్యక్రమాల్లో ముందుండాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి ప్రమోద్‌కుమార్ కోరారు. అమావాస్యను పురష్కరించుకుని జఫర్‌గఢ్ మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ప్రమోద్‌కుమార్ హాజరై మాట్లాడారు. పేద ఆర్యవైశ్యులు రాజీవ్ యువ వికాస్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గన్ను నర్సింహులు, బెజగం భిక్షపతి, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంచూరి యుగందర్ పాల్గొన్నారు.

అన్నదానం

పాలకుర్తి: అమావాస్య ప్రసాద వితరణ కమిటీ ఆధ్వర్యంలో పాలకుర్తిలో మహా అన్నదానాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో దాతలు మారం శ్రీనివాస్, అల్లాడి వెంకటేశ్వర్లు, సంగునూరి మధు, నాగరాజు, మంతెన, విద్యాసాగర్, రాము, ఉపేందర్‌తోపాటు జిల్లా యువజన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సంతోష్ కుమార్, జిల్లా యువజన సంఘం నాయకుడువెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగడి వేలం వాయిదా

నర్మెట: మండల కేంద్రంలో ప్రతీ బుధవారం నిర్వహించే వారాంతపు సంత వేలం కార్యదర్శి కందకట్ల శ్రీధర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. కాగా, తైబజార్ రూ. 1.35 లక్షలకు పులి రాజు దక్కించుకోగా, పశువులసంత (రహదారి) సర్కారువారి ధర రానందున ఏప్రిల్ 2వ తేదీకి డీఎల్‌పీఓ బి. వెంకట్ రెడ్డి వాయిదా వేశారు. జీపీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఎంపీడీఓ అరవింద్ చౌదరి, బిల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి, పాటదారులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అండర్ పాస్ నిర్మించాలి

జనగామ రూరల్: రఘునాథపల్లి మండలం నిడిగొండ వద్ద నేషనల్ హైవే పై అండర్ పాస్ నిర్మాణం చేపట్టి ప్రమాదాలు జరగకుండా చూడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై కలెక్టరేట్ ఏఓ మన్సూరీకి వినతి పత్రం అందజేశారు. పార్టీ మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ నాయకులు నామాల యాదగిరి, వంగాల ఎల్లేష్, పెసరు యాదగిరి, గోపగోని వెంకటేశ్వర్లు, బండారు యాదగిరి, పాల్గొన్నారు.

రేషన్ షాపుల వద్ద ప్రధాని ఫొటోను ఏర్పాటు చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత రేషన్ పథకం ద్వారా పేదలకు ఉచితంగా బియ్యాన్ని అందిస్తున్నారని, రేషన్‌షాపుల వద్ద ప్రధాని నరేంద్రమోదీ ఫొటోలను ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ మండల పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆర్డీఓ డీఎస్ వెంకన్నకు శనివారం వినతిపత్రాన్ని అందించారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బడి బాగుకు పాటుపడండి

దేవరుప్పుల: ఓనమాలు నేర్పిన బడుల బాగు కోసం పూర్వ విద్యార్థులు పాటుపడాలని మండల విద్యాధికారి గుంటిపల్లి కళావతి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల(చెర్లబడి)లో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ సిహెచ్ శ్రీనివాస్, పూర్వ విద్యార్థి, పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి సంయుక్త ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను ఆమె ప్రారంభించారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

జఫర్‌గఢ్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్సై రామ్‌చరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం మీదికొండ గ్రామానికి చెందిన నాగరాజు సమీప బంధువు అంత్యక్రియల కోసం జఫర్‌గఢ్‌కు తన ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా తిమ్మంపేట గ్రామ శివారులో స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, మృతుడి బావ కలిపాక ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన బార్ అసోసియేషన్ బాధ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరిని హనుమకొండలోని ఆయన నివాసంలో స్టేషన్‌ఘన్‌పూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకం రమేశ్ ఆధ్వర్యంలో అసోసియేషన్ బాధ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. న్యాయవాదులు మునిగాల రవీందర్, ఎస్‌కే షణ్ముకుమారి, పసునూటి శ్రీలత, టీఆర్ సాల్మన్‌రాజ్, అమరోజు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మండల సమాఖ్య పాలకవర్గం ఏర్పాటు

తరిగొప్పుల: జీవనజ్యోతి మండల సమాఖ్య నూతన పాలకవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. మండల సమాఖ్య 85వ సమావేశంలో నూతన బైలా ప్రకారం ఎన్నికల్లో 20 గ్రామ సంఘాలకు ప్రతీ రెండింటికి ఒక నియోజకవర్గాన్ని ఏర్పాటు చేసి వాటి నుంచి 10 మందిని ఈసీ సభ్యులుగా తీసుకున్నారు. వారందరూ కలిసి మండల నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పల్లి భూలక్ష్మి, కార్యదర్శిగా తాళ్లపెల్లి రమాదేవి, కోశాధికారిగా కావటి మాధవిని ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమంలో ఏపీఎం విజయ, సీసీలు యాదగిరి, సిద్దులు, ఎంఎస్‌ఏ స్వర్ణలత, గ్రామసంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

వరి పరిపక్వతకు వచ్చాకే కోత కోయాలి

చిల్పూరు: వరి పూర్తిగా పరిపక్వత వచ్చాకే కోతలు చేపడితే అధిక దిగుబడి వస్తుందని స్టేషన్‌ఘన్‌పూర్ ఏడీఏ వసంత అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలో శనివారం వరిపొలాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొద్ది రోజుల్లో వరి కోతలు మొదలవనున్న నేపథ్యంలో రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ వినయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

దేవరుప్పుల: మండల కేంద్రంలోని జనగామ-సూర్యాపేట రహదారి చౌరస్తాలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, ఎంపీడీఓ కె.లక్ష్మీనారాయణ ప్రారంభించారు. పంచాయతీ సిబ్బంది సకాలంలో సురక్షిత తాగునీటిని ప్రజలకు అందించేందుకు పాటుపడాలని సూచించారు. జీపీ కార్యదర్శి మధుకర్, కారోబార్ వెంకట్‌రెడ్డి, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.